క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ అయోధ్యనగర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేదారేశ్వరపేట, లోటస్ ల్యాండ్‌మార్క్, రామలింగేశ్వరపేట మొత్తం ఏరియా, శాంతినగర్, అయోధ్యనగర్ ఏరియా, బసవతారకనగర్, బుడమేరుకట్ట, సూరిబాబు కాలనీ, డొంకరోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మధురానగర్ సెక్షన్ పరిధిలో..

వినాయకనగర్, శంకర్ బిస్కెట్స్ రోడ్డు, డొంక రోడ్డు, గుణదలసెక్షన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షల సాయం




సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇటీవల పదవీ విరమణ పొందిన హోంగార్డు కుటుంబానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు మరణించినా లేదా పదవీ విరమణ చేసిన తరువాత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా తమ వేతనం నుంచి వారికి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమన్నారు. నగరంలో మహిళా హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ గత నెల 13న పదవీ విరమణ పొందిన గాలి ప్రభాకరమ్మకు నగదును సీపీ అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, హోంగార్డు ఆర్ఐ.కృష్ణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు కుర్చీలు వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయమని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురంలో బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బాలల దినోత్సవం పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందజేయటం అభినందనీయమని కొనియాడారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు తమవంతు బాధ్యతగా కుర్చీలు అందజేస్తున్నామని తెలిపారు. తొలుత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శనగశెట్టి హరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.రామకృష్ణప్రసాద్, మాదు వెంకటకృష్ణారావు, సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి ఏడుకొండలు, రాము, పసుపులేటి ఏసు, పోతుల విల్సన్‌రాజు, జాని, జేవీకే రెడ్డి, నాగమల్లిక, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. శ్రీధర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి, శ్రీకాంత్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారులకు వేదిక కల్పించాలని పేద కళాకారులను ఆర్థికంగా ఆదుకోవాలని సూచించారు. మంగరాజు, మాధవి, షబానా, శిరిమోక్ష, శ్యాంప్రసాద్ తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు తోలేటి శ్రీకాంత్‌ను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ది ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యాన ముత్యాలంపాడు ఎంఎస్ మూర్తి లలితకళ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ రామాయణ సుధానిధి, భాషాప్రవీణ డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 'ప్రపంచమొక పటం-చిత్రకారుడు భగవంతుడు' అనే అంశంపై ప్రవచనం చేశారు.చిత్రకళల అభివృద్ధికి ఎంఎస్ మూర్తి చేసిన సేవలను కొనియాడారు

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- అట్టహాసంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి పేదవాడు ఆనందంగా ఉండాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం, సంక్షేమాభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ మధురానగర్ 208వ వార్డు సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి కొబ్బరితోట సర్కిల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వార్డు సచివాలయంలో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా రూ. 4.65 లక్షల కోట్లు అందించినట్లు వెల్లడించారు.

రూ. 13.98 కోట్ల సంక్షేమం...

208వ వార్డు సచివాలయ పరిధిలోని 2,867 మందికి గత నాలుగున్నరేళ్లలో రూ. 8.17 కోట్లు డీబీటీ ద్వారా లబ్ధి చేకూర్చినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. అలాగే నాన్ డీబీటీ ద్వారా 1,166 మందికి రూ. 5.81 కోట్లు మొత్తంగా 4,033 మందికి రూ. 13.98 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మాల్యాద్రి, వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు నాయకులు టీ మురళీ కృష్ణంరాజు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



'వై ఏపీ నీడ్స్ జగన్' కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ, కొంగితల లక్ష్మీపతి

26వ డివిజన్‌లో....

26వ డివిజన్ మాచవరంలోని 31వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావు గొల్లభామతో కలిసి మంగళవారం ఆయన పాల్గొన్నారు. తొలుత దాసాంజనేయస్వామి ఆలయం వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 31వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 1,933 మందికి రూ. 5.46 కోట్లు డీబీటీ ద్వారా.. అలాగే నాన్ డీబీటీ ద్వారా 573 మందికి రూ. 1.4 కోట్లు లబ్ధి చేకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మాల్యాద్రి, డివిజన్ కోఆర్డినేటర్ కె.నాగాంజనేయులు, నాయకులు శనగశెట్టి హరిబాబు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



సంక్షేమాభివృద్ధి బోర్డు ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు

జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే విష్ణు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ ఒక్కరూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలను పొందగల్గుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ డివిజన్ కో-ఆర్డినేటర్ పసుపులేటి ఏసు, నాయకులు మోదుగుల గణేష్, సిహెచ్. రవి, తిరుపతిరావు, వైద్యులు, సీడీఓ జి.జగదీశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో...

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో 215వ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. వైద్య సేవలు పొందిన వారికి ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు.

ఎల్లో మీడియా తప్పుడు ఆరోపణలు...

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ చేస్తున్న మంచి పనికి ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ఆరోపణలు, రాతలతో విషం కక్కుతున్నాయని మల్లాది విష్ణు విమర్శించారు. వారు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతుగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, పలు విభాగాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

32వ డివిజన్‌లో....

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ 231వ వార్డు సచివాలయం పరిధి అయోధ్యనగర్‌లో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం పాల్గొన్నారు. శిబిరంలో వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి గుండే సుందర్‌పాల్, పేరం త్రివేణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో......

28వ డివిజన్ 202వ వార్డు సచివాలయం పరిధి భానునగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇంఛార్జి కనపర్తి కొండతో కలిసి మంగళవారం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

27వ డివిజన్‌లో...

27వ డివిజన్ 197 వార్డు సచివాలయం పరిధి లో జగనన్న ఆరోగ్య సురక్ష శిభిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ఆరోగ్య శిబిరంలో అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

చీటింగ్ కేసులో టీడీపీ నాయకుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పేదలకు జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇల్లు ఇప్పిస్తామని చెప్పి నమ్మించి మోసం చేయడం, వారి నుంచి భారీగా డబ్బులు వసూలు కేసులో కొత్తపేట పోలీసులు మంగళవారం టీడీపీ నాయకుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టినగర్, కంసాలిపేట, కేదారేశ్వరపేటకు చెందిన పలువురి నుంచి కొంత మంది టీడీపీ నాయకులు ఇల్లు ఇప్పిస్తామని సుమారు రెండున్నర కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే డబ్బులు తీసుకున్న తర్వాత ఇల్లు మంజూరు చేసినట్లు నకిలీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్లాట్ల కేటాయింపు జరగకపోవడంతో బాధితులు తాము మోసపోయినట్లు గ్రహించి గత నెల 7వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు అప్పట్లో ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేశారు. తాజా అదే కేసులో మరో నిందితుడైన కొట్టేటి హనుమంతరావు(58)ని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

నటుడు చంద్రమోహన్ మృతి సినీ రంగానికి తీరనిలోటు



విజయవాడ కల్చరల్: సినీ నటుడు చంద్రమోహన్ మృతి సినీ రంగానికి తీరనిలోటు అని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. రమణా కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికలో చంద్రమోహన్ సంతాప సభను మంగళవారం నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ 60 సంవత్సరాల సినీ ప్రస్థానంలో అనేక విభిన్న పాత్రలు పోషించినట్లు తెలిపారు. రమణా కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాంతి రమణ మాట్లాడుతూ తమ సంస్థకు చంద్రమోహన్ గౌరవ అధ్యక్షుడని చెప్పారు. చంద్రమోహన్ చిత్రపటానికి నివాళి సమర్పించారు. వివిధ సంస్థల ప్రతినిధులు రమణ కోకిలి, గోళ్ళ నారాయణరావు, యాకోబ్, ఎస్‌వీ వెంకటరమణ, రమాశంకర్ సంతాప కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు జీఎం 'మ్యాన్ ఆఫ్ ద మంత్' సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా, సకాలంలో చురుగ్గా స్పందించి ప్రమాదాల నివారణకు కృషి చేసిన విజయవాడ డివిజన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులకు జీఎం 'మ్యాన్ ఆఫ్ ద మంత్' సేఫ్టీ అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జీఎం ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ సోమవారం విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన అవార్డులను ప్రకటించారు. ఈ మేరకు విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మంగళవారం తన కార్యాలయంలో ఆయా ఉద్యోగులకు ఈ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో పనిచేస్తున్న ట్రాక్ మెయిటెనర్ ఆర్.అశ్రునాయుడు, గూడ్స్ లోకో పైలట్ కె.సతీష్‌బాబు, మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న పి.అవినాష్, రాజమండ్రి సీ అండ్ డబ్ల్యూ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఎస్.వీరారెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా బాలల దినోత్సవం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. శారద కళాశాల ప్రిన్సిపాల్ పి. రాజేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యాసంస్థల సెక్రటరీ, కరెస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, చైర్మన్ మోనికాసుమన్, ప్రిన్సిపాల్ లక్ష్మీకొలస్య, వైఎస్ ప్రిన్సిపాల్ దివ్య పాల్గొన్నారు.

ప్రశాంతి స్కూల్‌లో...

జయహో వాకర్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని ప్రశాంతి ఎలిమెంటరీ పాఠశాల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ జయశ్రీ, సభ్యులు రమాదేవి, ఆంజనేయరెడ్డి, హెచ్ఎం జాన్సి పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో ...

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్‌లో బాలల దినోత్సవం పురస్కరించుకుని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ విజయవాడ శాఖ ఆధ్వర్యాన అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు, బౌల్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళిలర్పించారు. కృష్ణప్రసాద్, డీ.సాంబశివరావు, యశోద, సుశీల, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్లో..

పాయకాపురం(విజయవాడరూరల్): పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రేణుకాదేవి, సత్యవతి, సునంద, గణేష్, ఉమా పాల్గొన్నారు.



చాచా నెహ్రూ స్ఫూర్తితో..

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓ బాలుడు తన ఔదార్యాన్ని చాటాడు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయులకు తన వంతుగా మంగళవారం ఆహారం, పండ్లు అందజేశాడు. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఘనంగా ప్రారంభమైన కార్తిక మాసోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో కార్తిక మాసోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్‌లోని శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ దేవాలయం, రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి దేవాలయంలో కార్తిక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు.

సంక్షేమాభివృద్ధికి కేరాఫ్.. జగనన్న ప్రభుత్వం



పాయకాపురం(విజయవాడరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ళ పాలన సంక్షేమాభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచిందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 239వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజాతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్ళి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ఆరా తీయడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకోవడమే అజెండాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంతృప్తిగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ఒక బోగస్ అని మల్లాది విష్ణు విమర్శించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన కలయిక మరోసారి అట్టర్‌ఫ్లాప్ అవడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఉమ్మడి వెంకట్రావ్, శర్మ, గోపాల్‌రెడ్డి, వసంత్, వజీర్, తోపుల వరలక్ష్మి, శోభన్, మారుతి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. ఆధునిక ఆలయాలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజల జీవన వికాసానికి, సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గ్రంథాలయ విశిష్టతను నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాల వారోత్సవాలను కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం ప్రారంభించారు. తొలుత జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ సేవలకు గుర్తుగా ఆయన జన్మదినం రోజున జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ గ్రంథాలయాల ద్వారా అందే సమాచారానికి మించినది లేదన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయన్నారు. సాహితీ వ్యక్త జి.వి. పూర్ణచందు, స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, గ్రంథాలయ కార్యదర్శి నగేష్, గ్రంథపాలకులు కె.రమదేవి, జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురం కళ్ళేపల్లి శేషంరాజు స్మారక గ్రంథాలయంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇందిరా మహిళా మండలి కార్యదర్శి వాడ్రేవు లక్ష్మి తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల్లో ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన లయోలా కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.



అయ్యంకి, నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గ్రంథాలయాలు విజ్ఞాన జ్యోతులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజ్ఞాన జ్యోతులని, ఒక ప్రాంతంలో గ్రంథాలయం ఉంటే ఆ ప్రాంతమంతా విజ్ఞానం విస్తరిస్తుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలతో పాటు బాలల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు.

సాంస్కృతిక వికాస కేంద్రాలు

విజయవాడ కల్చరల్: గ్రంథాలయాలు సాంస్కృతిక వికాస కేంద్రాలని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో వారంపాటు నిర్వహించే ఉత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయాల పాత్ర విశిష్టమమైనదన్నారు. హనుమంతరాయ గ్రంథాలయాన్ని ఆధుకరించినట్లు గ్రంథాలయం అధ్యక్షుడు డోకిపర్తి శంకరావు తెలిపారు.

మధుమేహంపై అప్రమతంగా ఉండాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మధుమేహ వ్యాధి నియంత్రణలో లేకపోతే గుండె, కాలేయం, మూత్రపిండాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని మధుమేహం పట్ల అప్రమతంగా ఉండాలని మణిపాల్ వైద్యుడు అడపా గిరిధర్ అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆరాధ్య మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. మధుమేహ, రక్తపోటు, సాధారణ వ్యాధుల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో ప్రతిఏటా లక్షల సంఖ్యలో మధుమేహం బారిన పడుతున్నారన్నారు. ఇన్సులిన్ స్థాయిని అదుపులో ఉంచుకోవాలని సూచించారు. వెంకటేశ్వరరావు, వేమూరు బాబురావు, సుశీలరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గిరిధర్

క్రీడాకారులు చదువును నిర్లక్ష్యం చేయొద్దు

డెప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ

విజయవాడరూరల్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణిస్తారో అప్పుడే జీవితంలో స్థిరపడతారని ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు సాధించిన ఇంటర్నేషనల్ ఆర్చరీలో అర్జున అవార్డు గ్రహీత, ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమంలో మంగళవారం సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయకూడదన్నారు. చాలా మంది క్రీడాకారులు ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందారని, ఆ తరహాలోనే తనను ప్రభుత్వం డెప్యూటీ కలెక్టర్‌గా నియమించిందన్నారు. అనంతరం ఇటీవల ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించిన కార్తీక, శరణ్యకు బంగారు పతకాలు అందజేశారు. అండర్-19 రెజ్లింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన బాలికల జట్టుకు ఆమె ట్రోఫీని అందజేశారు. అనంతరం నున్న జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి నరెడ్ల సత్యనారాయణరెడ్డి తదితరులు జ్యోతిసురేఖ, ఆమె తండ్రి సురేంద్రను ఘనంగా సత్కరించారు.



డెప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖకు సత్కారం

ఎయిర్ పోర్టు కారిడార్‌లో బ్యూటిఫికేషన్ పెంచండి

మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం వరకు జరుగుతున్న ఎయిర్ పోర్ట్ కారిడార్ పనులు మరింత ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులను రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు. నూతనంగా నిర్మించిన గ్రిల్స్ బ్యూటిఫికేషన్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శ్రీలక్ష్మి క్షేత్రస్థాయిలో కారిడార్ పనులను పరిశీలించారు. కారిడార్ వెంట ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌పై ఆకర్షణీయం రంగులతో పెయింటింగ్ వేయాలని సూచించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు



కారిడార్ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, స్వప్నిల్ దినకర్